

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అంబం రోడ్డులో ఆటో, ద్విచక్ర వాహనాలపై పడిన భారీ వృక్షం



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్ రహదారిపై విరిగిపడ్డ భారీ వృక్షం

## ఎండ.. వాన.. తుఫాను

- రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు
- మధ్యాహ్నం భానుడి నిప్పులు
- ఒక్కసారిగా కమ్ముకొస్తున్న మేఘాలు
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుఫాను

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓవైపు భానుడు నిప్పులు కక్కుతుండగానే.. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 3.78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, నల్గొండలో 3.58 సెంటీమీటర్లు, వనపర్తి 3.48 సెంటీమీటర్లు, మహబూబ్‌నగర్ 3.33 సెంటీమీటర్ల వాన పడినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మొత్తంగా ఎనిమిది జిల్లాల్లో వానలు పడినట్టు చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం నుంచి పొడివాతావరణం ఉండగా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మబ్బులు కమ్మేశాయి. ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు ఇబ్బందిపెట్టాయి. పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం కలిగింది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుఫాను మరింత ఉద్ధృతమైతున్నది. ఈ తుఫాను ప్రభావం ప్రస్తుతానికి తెలంగాణపై ఉండదని అధికారులు చెప్తున్నారు. రాబోయే మూడు రోజులపాటు వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొన్నారు.

# గాలివాన బీభత్సానికి 14 మంది దుర్మరణం

## రాష్ట్రంలో భారీగా ప్రాణ, ఆస్తినష్టం

**ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఎనిమిది మంది మృతి**

**కూలిన రేకుల షెడ్లు, భారీ వృక్షాలు, విద్యుత్తు స్తంభాలు**

**పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం**



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులోని మునిరంగస్వామి ఆలయలంలో కూలిన ధ్వజస్తంభం



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 26: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం వర్షం బీభత్సం సృష్టించింది. భారీగా వీచిన ఈదురు గాలులకు తోడు వర్షం కురవడంతో చాలాచోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోవడంతోపాటు, గోడలు కూలాయి. అనేకచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా 14 మంది మరణించారు. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పిడుగుపాట్లకు కూడా ప్రాణనష్టం సంభవించింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని మునిరంగస్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం నేలకొరిగింది. కోస్గిలోని రామాలయం చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభం విరిగి కరెంట్ తీగలపై పడింది. నవాబ్‌పేట మండలం ఇప్పటూర్‌లో ఓ హోటల్ పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఒక్కసారిగా వీచిన గాలిదుమారంతోపాటు కురిసిన వర్షానికి నల్లగొండ జిల్లాలోని పలుచోట్ల తీవ్ర నష్టం జరిగింది. నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు కనగల్, కట్టంగూర్, పెద్దవూర, అనుముల మండలాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. నల్లగొండ-కట్టంగూర్ రోడ్డులో పెద్ద సంఖ్యలో చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండలోని పానగల్ ప్లైఓవర్ సమీపంలో ఓ లాడ్జి ఎలివేషన్ విరిగి పడటంతో విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. దాంతో సాయంత్రం నుంచి రాత్రి వరకు చాలాచోట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. హాలియాలో పిడుగుపాటుకు గంగిరెద్దు, పెద్దవూర మండలం పులిచర్లలో రెండు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గుడిపల్లి మండలం నడిమిబావిగూడెంలో ఓ ఇంట్లోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడగా మంటలు చెలరేగాయి. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లిలో పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధమైంది. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌తోపాటు పలుచోట్ల ధాన్యం తడిసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బాన్సువాడ, కోటగిరి, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాల్లో గాలి దుమారం తీవ్రనష్టం వాటిల్లింది. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో 15 గృహ, 10 వ్యవసాయ విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. సుమారు 20 ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. బాన్సువాడ- కామారెడ్డి ప్రధాన రహదారిపై కొయ్యగుట్ట వద్ద భారీ వృక్షం రోడ్డుపై పడింది. బాన్సువాడ మినీ ట్యాంక్‌బండ్ వద్ద సోలార్ హైమాస్ట్ లైట్ స్తంభాలు పడిపోయాయి. రుద్రూర్ మండలం అంబంలో చెట్టు విరిగి ఇంటి మీద పడింది. అంబం శివారులో భారీ వృక్షం కూలి ఒక ఆటో, రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం హస్నాపూర్, జామిడి, వడ్డాడి గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. హస్నాపూర్, ఉండం, సుంకిడి మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రోడ్డుపై భారీ వృక్షం నేలకొరగడంతో గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో ఎడ్లబండిపై పిడుగు పడటంతో రెండు ఎడ్లు మృత్యువాతపడ్డాయి. రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తచెడువాయిలో పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధమైంది. దహెగాం మండలం లగ్గాం గ్రామంలో విద్యుత్తు షాక్‌తో ఎద్దు మృత్యువాతపడింది.



సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్‌లో ఈదురు గాలులకు ధ్వంసమైన కోళ్లఫారం

### 14 మంది మృతి..

- నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం ఇంద్రకల్ శివారులో నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డు కూలి యజమాని మల్లేశ్ (40), కూతురు అనూష (13)తోపాటు ఇద్దరు కూలీలు రాములు (45), చెన్నమ్మ(43) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు పార్వతమ్మ, చిన్న నాగులు, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారికి జిల్లా కేంద్రంలోని దవాఖానలో చికిత్స అందిస్తున్నారు.
- నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి శివారులో రేకులషెడ్డు ఎగిరిపోయి కారుపై పడగా వేణుగోపాల్ (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తెలకపల్లి మండల కేంద్రంలో పిడుగుపాటుకు లక్ష్మణ్ (13), నందివడ్డెమాన్‌లో రైతు గోపాల్‌రెడ్డి (45), తిమ్మాజిపేట మండలం మారేపల్లిలో వెంకటయ్య (52) మృతి చెందారు. వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో రైతు ఒట్టు బాలకిష్టయ్య పొలంలోని తుమ్మచెట్టుపై పిడుగుపాటుకు ఆవు మృత్యువాతపడగా, ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు.
- మేడ్చల్ జిల్లా కీసర మండలం తిమ్మాయిపల్లిలో భారీ గాలి, వానకు చెట్టు కూలి యాదాద్రి జిల్లా బొమ్మల రామారం గ్రామానికి చెందిన నాగిరెడ్డి రాంరెడ్డి (56), ధనుంజయ (46) దుర్మరణం చెందారు.
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మియాపూర్‌లో ఇద్దరు మరణించారు. సాయినగర్‌లో ఐదో అంతస్థు నుంచి సిమెంట్ ఇటుకలు పడటంతో సమద్ (3) అనే బాలుడు మృతి చెందాడు. అదే కాలనీలో మహ్మద్ రషీద్ బైక్‌పై వెళ్తుండగా ఓ ఇంటి ప్రహరీ సిమెంట్ ఇటుకలు తలపై పడటంతో మరణించాడు.
- సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని క్షీరసాగర్‌లో ఆదివారం రాత్రి ఈదురు గాలులకు కోళ్లఫారం గోడలు కూలి భాగ్యమ్మ(40), గౌరీశంకర్(30) మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొన్యాల బాల్‌రెడ్డి క్షతగాత్రులను పరామర్శించారు.



గ్రౌటింగ్ పంపును అమర్చుతున్న సిబ్బంది

## 'మేడిగడ్డ'లో గ్రౌటింగ్ పనులకు సిద్ధం

- బరాజ్‌కు చేరిన పంపింగ్ యంత్రాలు
- కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్, మే 26 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటిపల్లిలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో కుంగిన పియర్ల దిగువ భాగంలో ఖాళీ ప్రదేశాన్ని ఇసుక, సిమెంట్‌తో గ్రౌటింగ్ చేసి పూడ్చేందుకు పంపింగ్ యంత్రాలు ఆదివారం బరాజ్ వద్దకు చేరుకున్నాయి. బరాజ్ ఏడో బ్లాక్‌లో 11 గేట్లకు గాను 12, 13, 14, 15వ గేట్లు ఎత్తారు. మిగిలిన 16, 17, 18, 19వ గేట్లు ఎత్తాల్సి ఉన్నది. గ్రౌటింగ్ పూర్తయిన తర్వాత మిగతా గేట్లు ఎత్తుతారు. బరాజ్‌లో కుంగిన ప్రాంతంలోని 20, 21 గేట్లను ఆర్క్ కటింగ్ ద్వారా తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. బరాజ్ అప్‌స్ట్రీమ్‌లో ఏడో బ్లాక్ వరకు జరుగుతున్న మరమ్మతులకు వరదతో ఆటంకం కలుగకుండా నీటి మళ్లింపు కోసం మట్టి కట్టలు వేస్తున్నారు. డౌన్‌స్ట్రీమ్‌లో ఏర్పడిన ఊటలను యంత్రాలతో పంపింగ్ చేస్తున్నారు. బరాజ్‌లో అప్, డౌన్‌స్ట్రీమ్‌లో ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుకను ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు.


## నేడు పంజాబ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే26 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం పంజాబ్ రాష్ట్రానికి వెళ్లనున్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఉదయం పంజాబ్ వెళ్లి, అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు రానున్నట్టు తెలిపాయి.

# స్కూల్ యూనిఫారాలు అందేనా?

- జూన్ 12న విద్యార్థులకు ఇవ్వాలని లక్ష్యం
- జిల్లాలకు చేరిన 90 లక్షల మీటర్ల వస్త్రం
- 30 వేల ఎస్‌హెచ్‌జీలకు కుట్టించే బాధ్యత
- జతకు రూ.50గా కుట్టుకూలి నిర్ణయించడంతో ఆసక్తి చూపని దర్జీలు, మహిళా సంఘాలు






హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం ఇవ్వాలి. ఇది తెలంగాణ విద్యాశాఖ నిర్దేశించుకున్న లక్ష్యం. కానీ, ఈ లక్ష్యం నెరవేరే పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. జూన్ 12న విద్యార్థులకు యూనిఫారాలు అందడం కష్టంగానే కనిస్తున్నది. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం 21 లక్షల మంది విద్యార్థులకు తలా రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు 90,86,997 మీటర్ల వస్త్రాన్ని టెస్కో సంస్థ ద్వారా సేకరించారు. పలు జిల్లాల్లోని మండలాలకు యూనిఫామ్ వస్త్రం చేరింది. ఒక్కో జతకు కుట్టుకూలి రూ.50 మాత్రమే ఇస్తుండటంతో కుట్టేందుకు దర్జీలు ముందుకు రావడం లేదు. జగిత్యాల జిల్లాలో ఓ మండల పాయింట్ వద్దకు వస్త్రం చేరింది. స్కూళ్లకు ఇంకా చేరలేదు. ఈ సారి మొత్తం యూనిఫారాలు కట్టించే బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లోని మహిళా సంఘాలకు అప్పగించారు. గతంలో దర్జీలకు కొంత, మహిళా సంఘాలకు మరికొంత ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు మొత్తం మహిళా సంఘాలకే అప్పగించారు. మహిళా సంఘాలను గుర్తించే బాధ్యతను పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు అప్పగించారు. ఈ శాఖ రాష్ట్రవ్యాప్తంగా 30 వేల సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు యూనిఫారాలు కుట్టించే బాధ్యతలు అప్పగించింది. యూనిఫారాల కుట్టుకూలి తక్కువగా నిర్ణయించడంతో మహిళా సంఘాలు సైతం ఆసక్తి చూపడంలేదు. జగిత్యాల జిల్లాలోని ఓ స్కూళ్లో మహిళా సమాఖ్య సభ్యులు పిల్లలందరినీ పిలిపించి కొలతలు తీసుకుంటున్నట్టు ఫొటోలు తీసుకుని వెళ్లారు. మహిళా సంఘాలు ముందుకు రాకపోవడంతో వారి నుంచి అభ్యంతరం లేదని డిక్లరేషన్ తీసుకుని బయట దర్జీల చేత కుట్టించాలని విద్యాశాఖ అధికారులు ఇటీవలే ఆదేశాలిచ్చారు.

### పుస్తకాలు కూడా..

రాష్ట్రంలోని సర్కారు స్కూళ్ల విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు ఇప్పుడిప్పుడే జిల్లాలకు చేరుతున్నాయి. శనివారం వరకు 78 శాతం పుస్తకాలు జిల్లాలకు చేరాయి. మిగతా పుస్తకాలు జూన్ మొదటి వారంలో చేరే అవకాశమున్నది. తొలివిడతలో అందించే పార్ట్-1 పుస్తకాలు ఇప్పటి వరకు వికారాబాద్ జిల్లాకు 69 శాతం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు 72, నారాయణపేట జిల్లాకు 70 శాతం మాత్రమే చేరాయి. ఈ విద్యాసంవత్సరంలో 25,80,291 విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. మొత్తంగా 1.90 లక్షల పుస్తకాలు విద్యార్థులకు అందించాల్సి ఉన్నది. మొదటి విడుతలో పార్ట్-1 పుస్తకాలు అందిస్తున్నారు. ఇలా 1,43,11,141 పుస్తకాలను విద్యార్థులకు అందించేందుకు ముద్రించారు. వీటిలో ఇప్పటి వరకు 1,10,91,460 పుస్తకాలు జిల్లాలకు చేరాయి. ఇక రెండో విడుతలో పార్ట్ -2 పుస్తకాలను ఆగస్టులో అందించేందుకు విద్యాశాఖ ప్రయత్నిస్తున్నది.



రైతులకు అల్పాహారంగా ఉగ్గాని వడ్డిస్తున్న రైస్‌మిల్లు యజమానులు

## రైతుల ధర్నాతో దిగివచ్చిన సర్కార్

- ఎట్టకేలకు కొనుగోళ్లు ప్రారంభం
- రైస్‌మిల్లు వద్ద రైతులకు భోజనం ఏర్పాట్లు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

**నమస్తే ఎఫెక్ట్**

కోస్గి, మే 26 : రైతుల ఆందోళనతో దిగివచ్చిన సర్కార్ ధాన్యం కొనుగోళ్లకు ముందుకొచ్చింది. మూడు రోజులుగా రైస్‌మిల్లు చుట్టూ తిరిగినా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో విసుగుచెందిన రైతులు శనివారం నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలోని కడంపల్లి గేటు సమీపంలో కోస్గి-మద్దూర్ రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. మూడు, నాలుగు రోజుల నుంచి ధనలక్ష్మి రైస్‌మిల్ చుట్టూ తిరుగుతున్నా.. టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని పలువురు రైతులు ధ్వజమెత్తారు. దాదాపు 30 నుంచి 40 వరకు ట్రాక్టర్లు, ఆటోలు ఇతర వాహనాల్లో గ్రామాల నుంచి రైతులు ధాన్యం విక్రయించేందుకు తీసుకొచ్చినా కొనుగోలు చేయక పడిగాపులు కాయాల్సి వస్తుందని, తినేందుకు తిండి, తాగేందుకు నీళ్లు లేక గోసపడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల ఆందోళనను 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'ధాన్యం కొనక వాత' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీం తో ఎట్టకేలకు రైస్‌మిల్లు యజమానులు దిగివచ్చారు. ఆదివారం ఉదయం నుంచే రైతుల వడ్లను కొనుగోలును మొదలుపెట్టారు. కాగా రైతులకు అల్పాహారంగా ఉగ్గాని, మధ్యాహ్నం అన్నం, చికెన్ కర్రీ వడ్డించారు. పలుమార్లు స్వయంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నం వడ్డించారు.

# జూన్‌లో భారీగా బదిలీలు!

మొదటిపేజీ తరువాయి...

ఇతర పోస్టుల్లోకి మారుస్తారా? అని చర్చ జరుగుతున్నది.

### రాష్ట్రస్థాయిలోనే ఎక్కువ ప్రక్షాళన

సెక్రటేరియట్‌లోని కొంతమంది ముఖ్యమైన అధికారులకు స్థానచలనం తప్పదని చెప్తున్నారు. సీఎస్ శాంతికుమారిని కూడా మారుస్తారన్న ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ పక్కనబెడితే ఆమె స్థానంలో ఎవరు వస్తారన్నదానిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. శాంతికుమారి 1989 బ్యాచ్ అధికారిణి. ఆమె తర్వాత బ్యాచ్‌కు చెందినవాళ్లలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్‌గోయల్, సునీల్‌శర్మ ఉన్నారు. సునీల్‌శర్మ ఈ నెలలోనే రిటైర్ అవుతున్నారు. శశాంక్‌గోయల్ రిటైర్మెంట్‌కు ఇంకా సమయం ఉన్నది. ఆయనతోపాటు 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు సీఎస్ పదవిని ఆశిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రామకృష్ణారావుకే అవకాశం ఇస్తారని ప్రచారం జరిగింది. రాష్ట్రంలో సమర్థులైన అధికారుల్లో రామకృష్ణారావు ఒకరు అన్న పేరు ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు సీఎస్ ఇవ్వకుండా ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానే కొనసాగించింది. ఆయనకు ఇప్పుడైనా అవకాశం ఇస్తారా? లేదా? అన్నది వేచిచూడాలి. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో సీఎస్ పదవిని తీసుకుంటారా? లేదా? అన్న చర్చ కూడా ఉన్నది. మరోవైపు, 1992 బ్యాచ్‌కు చెందిన జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వికాస్‌రాజ్ ఎన్నికల సంఘంలో పనిచేస్తున్నారు. ఆయనను రాష్ట్ర సర్వీసుల్లోకి తీసుకోవాలన్న ఆలోచనతో కూడా ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అయితే, వీరికన్నా ముందు బ్యాచ్ 1991కి చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ ఉన్నారు. కానీ, ఆయన పట్ల సీఎంకు సదభిప్రాయంలేదు. రెవెన్యూశాఖలో అధికారుల మార్పులపైనా జోరుగా చర్చ జరుగుతున్నది. ముఖ్యకార్యదర్శిగా ఉన్న నవీన్ మిట్టల్‌ను పక్కన పెడతారన్న ప్రచారం జరుగుతున్నది. ఆయన స్థానంలో ఏపీకి చెందిన ఓ సీనియర్ అధికారి (ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు)ని తీసుకువస్తారని తెలుస్తున్నది. ఈశాన్య రాష్ట్రాల్లో పనిచేస్తున్న తెలుగు అధికారి ఒకరిని తీసుకొస్తారన్న ప్రచారమూ నడుస్తున్నది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కూడా మారుస్తారని చెప్తున్నారు. పలు శాఖల హెచ్‌వోడీలనూ మార్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. పలు జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను కూడా మార్చే అవకాశం ఉన్నది.

### ఐపీఎస్ అధికారులు కూడా..

పలువురు పోలీసు ఉన్నతాధికారుల బదిలీలనూ ప్రభుత్వం చేపట్టనున్నట్టు తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల వేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు ఐపీఎస్ అధికారులను కీలకపోస్టుల్లో నియమించింది. తర్వలోనే ఎన్నికల కోడ్ ముగియనుండటంతో ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేసేందుకు, తమకు అనుకూలమైన వారిని కీలక పోస్టుల్లో నియమించేందుకు రంగం సిద్ధమైనట్టు సమచారం. డీఎస్పీ స్థాయి నుంచి పలువురు సీనియర్ ఐపీఎస్‌లకు సైతం స్థానచలనం తప్పదనే చర్చ పోలీసు వర్గాల్లో మొదలైంది. పలు జిల్లాల ఎస్పీలు సైతం బదిలీ వేటుకు గురికాక తప్పదని తెలుస్తున్నది. పనిలో పనిగానే ముగ్గురు ఐజీలు, మరో ఇద్దరు అడిషనల్ డీజీలు బదిలీ అవుతారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నెల చివరిలో డీజీపీ ర్యాంకు అధికారి ఒకరు పదవి విరమణ చేస్తుండగా, ఆయన స్థానంలో కొత్త వారిని నియమిస్తారా? లేదా ఆయననే కొనసాగిస్తారా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. ఆయన గతంలో నిర్వర్తించిన విధి నిర్వహణను దృష్టిలో ఉంచుకొని మరో రెండేండ్లు కొనసాగిస్తారని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

### సీఎంవోలోనూ మార్పులు?

సీఎం కార్యాలయంలోనూ పలువురు అధికారులను మార్చే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. సీఎంవోలోకి మరికొంత మంది సమర్థులు, అనుభవం ఉన్న అధికారులను తీసుకురావాలని సీఎం భావిస్తున్నట్టు సమాచారం. ఒకరిద్దరు అధికారులను మార్చి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.